ప్రజాశక్తి
ఆదివారం 13 జులై 2025
5
విజయనగరం



జిల్లాకు సరిపడా ఎరువులు : కలెక్టర్

ప్రజాశక్తి- విజయనగరం

జిల్లాలో రైతులకు సరిపడా ఎరువులు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. శనివారం వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, వ్యవసాయ అధికారులు, మార్క్‌ఫెడ్ జిల్లా నాయకులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెలలో 6,825 మెట్రిక్ టన్నుల యూరియా, 290 మెట్రిక్ టన్నుల డిఎపి, 2,117 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 585 మెట్రిక్ టన్నుల ఇతర ఎరువులు అందుబాటులో ఉన్నాయని, మొత్తం 14,404 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పంటల బీమాపై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పశువుల విషయంలో ఏవైనా సమస్యలుంటే కంట్రోల్ రూమ్‌నెం.8331056279కు సంప్రదించాల్సిందిగా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

పెద్దాసుపత్రికి రోగుల తాకిడి

- మందుల కోసం గంటల తరబడి నిరీక్షణ
- మరో కౌంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్



మందుల కోసం కౌంటర్ వద్ద క్యూలో ఉన్న రోగులు, బంధువులు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి రోగుల తాకిడి పెరిగింది. దీంతో సౌకర్యాలు లేక ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ఓపి దగ్గర నుంచి మందులు తీసుకునేంత వరకు రోగులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రిలో ఒపి విభాగంలో ప్రభుత్వం ఆధారకార్డు ఎన్రోల్ నమోదు చేయాలని చెప్పడంతో ఓపి విభాగంలో కొంత ఆలస్యం అవుతోంది. వైద్యుని వద్దకు వెళ్లి రోగులు చూపించుకొని వచ్చే సమయానికి మందులు గది వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ప్రధానంగా మందులు ఇచ్చే ఫార్మసీలో ఇద్దరు లేదా ముగ్గురు ఫార్మసిస్టులు మాత్రమే ఉంటున్నారు. మందులిచ్చి ఫలానా సమయంలో మందులు వేసుకోవాలని సూచించడానికి కూడా ఎక్కువ సమయం పట్టడంతో గంటల కొద్దీ మందులు ఇచ్చే కౌంటర్ వద్ద రోగులు నిరీక్షించాల్సి వస్తుంది. శనివారం పాఠశాలలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావడంతో కేంద్ర ఆస్పత్రికి రోగులు అధిక సంఖ్యలో వచ్చారు. దీంతో ఆసుపత్రి ఆవరణలో రోగులతో కిటకిటలాడింది. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ప్రతిరోజు సుమారు 1000 మంది వరకు ఓపి నమోదు అవుతోంది. ఈ తాకిడి మరింత పెరగడంతో ఓపి విభాగంతో పాటు మందులు ఇచ్చే గది వద్ద క్యూ లైన్లు దర్శనమిచ్చాయి.

ఒకే కౌంటర్ తో ఇబ్బందులు

జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మందులు ఇచ్చే గది ఒకటే కావడంతో రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సిన వస్తోంది. మరో కౌంటర్ ఏర్పాటు చేస్తే రోగులు వేగవంతంగా మందులు తీసుకునే అవకాశం ఉంది. ఒకే మందుల ఇచ్చే గదితో పాటు మందులు ఇచ్చేవారు వాటిని ఎలా వేసుకోవాలో చెప్పేవారు కూడా ఇద్దరు, ముగ్గురు ఫార్మసిస్ట్‌లే ఉండడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

ఒపి విభాగంలో..

ఒపి విభాగంలో ఐదుగురు వ్యక్తులు ఒపి అందిస్తున్నారు. ఒపి విభాగం కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ రోగి తన వెంట ఆధార్ కార్డు పట్టుకుని వెలితేనే ఒపి ఇస్తున్నారు. పైగా సెల్‌ఫోన్‌కు మెసేజ్ వస్తే అది కూడా చెబితేనే రోగికి ఏ కౌంటర్‌కు వెళ్లాలో చీటీపై రాసి ఇస్తారు. అప్పుడు ఒపి కౌంటర్‌కు వెళ్లి రోగి తన రోగం గురించి చెబితే ఏ వైద్యున్ని కలవాలో ఏ నెంబర్‌కు వెళ్లాలో సూచించే విధంగా ఒక స్లిప్ ఇస్తారు. ఆ స్లిప్ పట్టుకుని వైద్యున్ని కలిసిన తరువాత ఆయన సూచనలు మేరకు మందులు షాపునకు వెళ్లి మందులు తీసుకోవాలి. మందులు ఇచ్చే దగ్గర మాత్రం రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని రోగులు అంటున్నారు. జిల్లా అధికారులు ఈ విషయంలో స్పందించి మందులు ఇవ్వడానికి మరో కౌంటర్ ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.

సిబ్బంది తక్కువగా ఉన్నారు

జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సిబ్బంది తక్కువగా ఉన్నారు. ఉన్న సిబ్బందితో మందులు అందిస్తున్నాం. మందులు గది వద్ద రోగులు ఉదయం 10.30గంటల నుంచి 12.30 సమయంలో ఎక్కువగా క్యూ లైన్లలో ఉంటున్నారు. ఆ సమయంలో మెయిన్ డ్రగ్స్ కేంద్రం నుంచి ఫార్మసిస్ట్‌ను తీసుకువచ్చి మందులు అందిస్తున్నాం. మరొక కౌంటర్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తాం.

శంబంగి అప్పలనాయుడు,
ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరిండెంట్, విజయనగరం.

డిగ్రీ ప్రవేశాలు వెంటనే చేపట్టాలి

రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్
ఉత్సాహంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్లీనరీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు రామ్మోహన్

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

పట్టణంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మొదటగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.రాము ఎస్ఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రారంభ ఉపన్యాసంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి రామ్మోహన్ మాట్లాడుతూ విజయనగరం జిల్లా ఉద్యమాల ఖిల్లా అని ఈ రోజు భారత ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చి అన్ని రాష్ట్రాల మీద అమలు చేయాలని రుద్దుతుందన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం హయాంలో అత్యుత్సాహంగా నూతన విద్యా విధానాన్ని అమలు చేశారని దీని వల్ల అనేక మంది విద్యార్థులు విద్యకు దూరమయ్యారన్నారు. వేలాది పాఠశాలలు మూతపడ్డాయన్నారు. ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు ఆరోజు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నూతన విద్యా విదానాన్ని రద్దు చేస్తామని చెప్పి ఈరోజు అదే విద్యా విధానాన్ని శరవేగంగా అమలు చేస్తున్నారన్నారు. కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు నూతన విద్యా విధానాన్ని అమలు చేయబోమని అసెంబ్లీ ద్వారా తీర్మానం చేసుకున్నాయని మన రాష్ట్ర ప్రభుత్వం యథేచ్ఛగా ప్రైవేట్ విద్యా విధానాన్ని పెంపొందించేందుకు పి4 విధానాన్ని ముందుకు తీసుకు వస్తుందని అన్నారు. కేరళ ప్రభుత్వం విద్యలో మోడల్‌గా నిలుస్తుందని ఒక పాలసీని తీసుకు వచ్చి బ్యాక్ బెంచ్ ఫ్రంట్ బెంచ్ అనే తారతమ్యాలు లేకుండా విద్యార్థుల్లో ఎటువంటి వివక్షత లేకుండా క్లాస్ రూమ్‌లో యుషేప్ విధానాన్ని అమలు చేస్తుందని గుర్తు చేశారు. మన రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేష్ గతంలో పాదయాత్రలో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జీవో నెంబర్ 77 రద్దు చేస్తామని, హాస్టల్ భవనాలను నూతనంగా నిర్మిస్తామని చెప్పి ఈ రోజు గాలికి వదిలేస్తున్నారన్నారు. కేంద్రంలో బిజెపి ఉమర్ ఖలీద్‌తో పాటు మరి కొంత మంది విద్యార్థులపై కేసులు పెట్టడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏ విధానాలను అనుసరిస్తుందో రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే విధానాల్ని పక్కాగా మన రాష్ట్రంలో అమలు చేస్తుందన్నారు. విద్యార్థి మిత్రులు భవిష్యత్తు పోరాటానికి సిద్ధంగా ఉండాలని నూతన విద్యా విధానంపై అలుపెరిగిన పోరాటం చేయాలని, హాస్టల్ భవనాలకి మెస్ చార్జీలు పెంపుకై, మరో పోరాటానికి నడుం బిగించాలని కోరారు. డిగ్రీ ప్రవేశాలు ఇంత వరకూ కల్పించకపోవడం దారుణమన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఏమి చదవాలని ప్రశ్నించారు. వెంటనే ఆఫ్ లైన్‌లో డిగ్రీ ప్రవేశాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సభలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షు, కార్యదర్శిలు డి.రాము, సిహెచ్. వెంకటేష్, అధ్యక్ష వర్గంగా శిరీష, రాజు, రమేష్, జిల్లా ఆఫీసు బేరర్స్, జిల్లా కమిటీ సభ్యులు, ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీబాల వీరాంజనేయస్వామి

విద్యార్థుల ఆరోగ్యం, భద్రత పట్ల రాజీపడొద్దు

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి వీరాంజనేయస్వామి

ప్రజాశక్తి - పార్వతీపురం

గురుకులాలు, వసతి గృహ విద్యార్థుల ఆరోగ్యం, భద్రత పట్ల రాజీపడవద్దని సాంఘిక సంక్షేమం శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి వసతి గృహ వార్డెన్లను ఆదేశించారు. గురుకులాలు, వసతి గృహాల్లోని ఖాళీలన్నీ భర్తీ కావాలని, గ్రామాల్లో తిరిగి విద్యార్థుల ప్రవేశాలు చేయించాలని అన్నారు. తల్లిదండ్రులు లేనివారు, తల్లి, తండ్రి లేని వారికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో పార్వతీపురం, విజయనగరం జిల్లాలకు చెందిన అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్సీ వసతి గృహాల మరమ్మతులకు రూ.143 కోట్లు నిధులు ఇచ్చామని, జిల్లాకు రూ.3 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఆ నిధులతో సొంత ఇంటికి తీసుకునే శ్రద్ధను కనబరచి వసతి గృహ మరమ్మతులు చేపట్టాలని వార్డెన్లను ఆదేశించారు. బాలికల వసతి గృహాల్లో లోపల మరుగుదొడ్లను ఏర్పాటు చేసుకోవాలని, మరుగుదొడ్ల లోపల లైట్లు ఉండాలని, అలాగే రక్షణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. హాస్టళ్లను ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచాలని, అందుకు అవసరమైన సామాగ్రిని ఉంచుకోవాలన్నారు. అనారోగ్యంతో ఉండే పిల్లలను ఆసుపత్రికి తీసుకు వెళ్లాలని, అత్యవసరమైతే కార్పొరేట్ ఆసుపత్రిలో ఉచితంగా వైద్యం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. త్వరలో సీసీ కెమెరాలను ప్రతి హాస్టల్‌కు ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. రాష్ట్ర విద్యా, పౌర సరఫరాల శాఖ మంత్రుల సహకారంతో ఫోర్టిఫైడ్ నాణ్యమైన బియ్యాన్ని వసతి గృహ విద్యార్థులకు అందిస్తున్నామని అన్నారు. ఇప్పటి వరకు స్టాకులో ఉండే పాత బియ్యాన్ని వెనక్కితెప్పించి, నాణ్యమైన బియ్యాన్ని పంపిణీ చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు వార్డెన్లు ప్రతి రోజు పర్యవేక్షిస్తూ ఉండాలని, గ్రామాల్లోని ఆదర్శ గ్రామ యోజన కార్యక్రమం కింద చేపడుతున్న పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. గతేడాదిలో అతిసారా, జ్వరాలు వచ్చే ప్రాంతాలను దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. నర్సింగ్ చదువుకునే విద్యార్థులకు జర్మన్ భాషను నేర్పించి, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. అనంతరం ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను మంత్రి అభినందిస్తూ, వసతి గృహ విద్యార్థులకు బెడ్‌లను పంపిణీ చేశారు. సమావేశంలో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ కె.హేమలత, పార్వతీపురం, విజయనగరం జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారులు ఇ.అప్పన్న, ఎం.అన్నపూర్ణ, ఎస్సీ కార్పొరేషన్ ఇడి ఎం.వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, వార్డెన్లు, తహశీల్దార్ సురేష్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదరికాన్ని రూపుమాపేందుకే పి4

15 నుంచి గ్రామ, వార్డు సభలు : కలెక్టర్

ప్రజాశక్తి - కంటోన్మెంట్

రాష్ట్రంలోని పేదరికాన్ని రూపుమాపడమే లక్ష్యంగా, స్వర్ణ ఆంధ్ర 2047 విజన్‌ప్లాన్‌లో భాగంగా ప్రభుత్వం పి 4 విధానాన్ని రూపొందించిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. బంగారు కుటుంబాల తుది జాబితాను తయారు చేసేందుకు ఈ నెల 15 నుంచి గ్రామ వార్డు సభలను నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. సిఎం సూచనలు మేరకు జిల్లాలో ఇప్పటికే 67,066 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. స్వర్ణాంధ్ర జీరో ప్రావర్టీ - పి 4 (పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ పార్ట్ నర్ షిప్) ద్వారా ఎంపిక చేసిన బంగారు కుటుంబాల జాబితాను మరోసారి పునఃపరిశీలన చేసి, మార్పులు చేర్పులతో తుది జాబితాను తయారు చేయనున్నట్లు తెలిపారు. దీనికోసం సచివాలయ సిబ్బంది ద్వారా గ్రామాలు, వార్డుల్లో జులై 15 నుండి 25 లోపల గ్రామ సభలను నిర్వహించి తుది జాబితాను తయారు చేస్తామన్నారు. ఆగస్టు 15 నాటికి తుది జాబితాలో ఉన్న బంగారు కుటుంబాలను మార్గదర్శకులు దత్తత తీసుకునేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్నారు. మార్గదర్శుల సహాయ సహకారాలతో బంగారు కుటుంబాలను పైకి తీసుకుని రావడానికి కార్యాచరణ ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. బంగారు కుటుంబాలను ఆర్థికంగానే కాకుండా చదువు, వైద్యం, ఇతర మౌలిక సదుపాయాల పరంగా అభివృద్ధి చేసేందుకు మార్గదర్శులు తోడ్పాటును అందిస్తారని తెలిపారు. కార్యక్రమాన్ని ప్రజలలోకి విస్తృతంగా తీసుకుని వెళ్లి రూట్స్, యాప్ ద్వారా వివరాలను సేకరించి దిగ్విజయం చేయాలని కలెక్టర్ కోరారు.

యుద్ధ ప్రాతిపదికన పైప్ లైన్ లీకేజీ పనులు

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

నగరంలో పలు ప్రాంతాలలో ఏర్పడ్డ పైపులైను లీకేజీ పనులను సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. వీటి అగ్రహారం, కొత్తపేట, బీసీ కాలనీలో రెండు చోట్ల పైపులైను లీకేజీలను గుర్తించారు. వీటికి తక్షణమే మరమ్మతు పనులు చేపట్టారు. దీంతో యధావిధిగా ఆయా ప్రాంతాల్లో నీటి సరఫరా జరుగుతుంది. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ పైప్లైన్ లీకేజీలను గుర్తించిన వెంటనే వాటి పనులను చేపట్టామన్నారు. ఎక్కడా నీరు కలుషితం కాకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలనూ తీసుకుంటున్నామన్నారు. రంగు మారిన నీరు పంపిణీ అవుతుందని వచ్చిన ఫిర్యాదు మేరకు తక్షణమే సిబ్బందిని అప్రమత్తం చేసి పరిస్థితిని పరిశీలించాలని ఆదేశించామన్నారు. ప్రతిరోజు సచివాలయాల వారిగా నీటి నమూనా పరీక్షలను జరిపిస్తున్నామన్నారు. సురక్షితమైన తాగునీటిని అందించేందుకు నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నామన్నారు. ఎక్కడైనా రంగు మారిన నీటిని గమనించినట్లయితే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. ప్రజలు కూడా తాగునీటిని వృథా చేయకుండా టాప్ హెడ్స్‌ను బిగించుకోవాలని తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు



డాగ్ స్క్వాడ్‌తో సోదాలు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

రైళ్ళలో గంజాయి అక్రమ రవాణ నియంత్రణే లక్ష్యంగా శుక్రవారం రాత్రి ఫలక్‌నామా ఎక్స్‌ప్రెస్‌లో స్థానిక పోలీసు, జిఆర్‌పి, ఈగల్, ఆర్‌పిఎఫ్ పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గంజాయి ప్రధానంగా ఒడిస్సా నుంచి రైళ్ల ద్వారా ఇతర ప్రాంతాలకు అక్రమంగా రవాణా అవుతుందన్న సమాచారంతో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ బృందం విజయనగరం రైల్వే స్టేషనులో ఫలక్‌నామా ఎక్స్‌ప్రెస్లో విశాఖపట్నం వరకు ప్రయాణించి, బృందాలుగా ఏర్పడి అన్ని భోగీల్లోను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పాల్గొన్న పోలీసు సిబ్బందికి, అధికారులకు ప్రయాణికులతో వ్యవహరించాల్సిన తీరు గురించి విజయనగరం వన్ టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్ ముందుగా వివరించి, వారు నిర్వర్తించే విధులు గురించి దిశా నిర్దేశం చేశారు. గంజాయి, ఇతర మత్తు పదార్ధాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగం గురించి సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబరు 1972కు అందించాలని ఆయన కోరారు. ఈ తనిఖీల్లో తెర్లాం ఎస్ఐ సాగర్‌బాబు, జిఆర్పి ఎస్ఐ మధుసూధనరావు, ఆర్.పి.ఎఫ్ ఎస్ఐ శ్రీధర్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది, 40మంది పోలీసులు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరి



గాత్రకచేరి చేస్తున్న యామిని కృష్ణ

ప్రజాశక్తి - విజయనగరం కోట

ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్, శ్రీనాదవర్ధని సంగీతాలయం సంయుక్తంగా శనివారం సాయంత్రం ఆర్య సోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో నిర్వహించిన 'వందే గురు పరంపరాం' శీర్షికగా శ్రీకాకుళానికి చెందిన కె.యామినికృష్ణ గాత్ర కచేరి అందరిని అలరించింది. వసంత రాగవర్ణంతో కచేరి ప్రారంభించి, హంసవినోడిని రాగంలో బాలమురళీ రచన గురువుని స్మరింపుము, కాంభోజ రాగంలో మైసూర్ వాసుదేవాచార్య కృతి లంబోదర మావాలంబే, ప్రధానాం శంగా కల్యాణి రాగంలో త్యాగరాజ కృతి ఏ తావునార, తర్వాత జావళి, తిల్లాన, అభంగ్ మీరాభజన్ తదితర కృతులు, ఆలపించారు. వీరికి సరస్వతుల పార్థివ వయొలిన్ పై, ప్రముఖ మృదంగ విద్వాంసులు సంస్థ కార్యదర్శి డాక్టర్ మండపాక రవి సహకా రాన్ని అందించి కచేరి రక్తి కట్టించారు. ఈ కచేరికి అసోసియేషన్ అధ్యక్షులు ధవళ సర్వేశ్వరరావు, సభ్యులు మోదేకుర్తి శ్రీనివాసరావు, డాక్టర్ కె.ఎ.పద్మప్రియ, వి.అప్పలస్వామి, భోగరాజు సూర్యలక్ష్మి, శారద, శ్రోతలు పాల్గొన్నారు.




పట్టాభిరామ్‌కు నివాళ్లు అర్పిస్తున్న సాహితీవేత్తలు, స్వచ్ఛ సంస్థల ప్రతినిధులు

పట్టాభిరామ్ చిరస్మరణీయుడు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, ఇంద్రజాలికులు, మానసిక వైద్యులు, రచయిత పట్టాభిరామ్ చిరస్మరణీయుడని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు డాక్టర్ విఎస్ ప్రసాద్ కొనియాడారు. జిల్లా మెజీషయన్‌ల ఆధ్వర్యంలో గురజాడ పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రచయిత, సాహితీవేత్త, సముద్రాల గురుప్రసాద్, ప్రముఖ సాహితీవేత్త, డాక్టర్ గోపాలరావు, విజయనగరం గిరిజన విశ్వవిద్యాలయం పరిపాలనాధికారి డాక్టర్ ఎన్‌విఎస్ సూర్యనారాయణలు మాట్లాడుతూ పట్టాభిరామ్ జీవితం స్ఫూర్తిదాయకమని, ఆదర్శ ప్రాయమని అన్నారు. కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలనం చేసిన గోటేటి హిమబిందు, ప్రముఖ మెజీషియన్ శ్యామ్, ఎస్‌బిటి మార్కెట్ పూర్వ అధ్యక్షులు పివి రామారావులు మాట్లాడుతూ పట్టాభిరామ్ ప్రత్యక్షంగాను, పరోక్షంగాను కోట్లాదిమంది జీవితాల్లో వెలుగులు నింపారని, ఆయన బాటలో నేటి యువత నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గురజాడ పాఠశాల ప్రిన్సిపాల్ పూడి శేఖర్, ఇంద్రజాలికులు పవన్ ఆశీష్, క్రాంతికుమార్, సలీమ్, సైకాలజిస్టులు ఎస్‌వి రమణ, శివ ప్రసాద్, రాజశేఖర్, రాంబాబు, ఎలిశెట్టి సురేష్, విశ్రాంత ఎంఇఒ ఈపు విజయ్‌కుమార్‌లు పట్టాభిరామ్‌కు ఘనంగా నివాళులర్పించారు.



టీకాలను అందజేస్తున్న వైద్య సిబ్బంది


ముమ్మరంగా రోగ నిరోధక టీకాలు

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

నగర వ్యాప్తంగా అన్ని సచివాలయాల పరిధిలో ఫీవర్ సర్వే, రోగ నిరోధక టీకాల వేసే కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. హెల్త్ కార్యదర్శులు, ఏఎన్ఎంలు సంయుక్తంగా ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే చేపడుతున్నారు. అంటు రోగాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలడానికి దోమలే ముఖ్య కారణం అన్న విషయాన్ని ప్రతి ఒక్కరిలో చైతన్యం తీసుకువస్తున్నారు. దోమల నిరోధానికి చేపట్టాల్సిన చర్యలను వివరిస్తున్నారు. బాలింతలు, గర్భిణులకు రోగనిరోధక టీకాలను అందిస్తున్నారు. అతిసారం వంటి ఇతర వ్యాధులను ఎదుర్కొనేందుకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఎంతో ఉపయోగంగా ఉంటాయని వివరిస్తూ, వాటిని ఉచితంగా అందజేస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం అన్ని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సరిపడా మందులు నిల్వ ఉన్నాయన్నారు.

ఎవరికి సుపరిపాలన..?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



సుపరిపాలన ఎవరికి? సాగునీటి కోసం దశాబ్దాలు తరబడి ఎదురుచూస్తున్న తోటపల్లి, జంఝావతి చివరి ఆయకట్టుదారులకా? సుమారు 20ఏళ్లు కావస్తున్నా నీటి చుక్కకూడా చూడని రామతీర్థ సాగర్ రైతులకా? రెక్కలు ముక్కలు చేసుకుంటూ రెండుపూటలా కష్టబడుతున్నా ఉపాధి కూలీలకా? అనారోగ్య బారిన పడితే డోలిమోత తప్పని గిరిజనులకా? వేట నిషేధ సమయానికి రెండేళ్ల తర్వాత భత్యం ఇచ్చినందుకు మత్స్యకారులకా? ఇంతకీ ఎవరికి...? పోనీ, ఆశా, అంగన్‌వాడీ, ఆయా, మధ్యాహ్నం భోజనం పథకం కార్మికులు వంటి స్కీమ్ వర్కర్లకు ఏమైనా భద్రత ఉందా? కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై పని భారం తగ్గిందా? రైతులకు ఏమైనా పెట్టుబడులకు తగ్గ సహకారం అందిస్తున్నందుకా? వీరు మాత్రమే కాదు... అనేక తరగతులు, వృత్తిదారుల నుంచి గడిచిన వారం రోజులుగా జిల్లాలో వినిపిస్తున్న పబ్లిక్ టాక్.

సుపరిపాలన పేరిట విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఇంటింటికీ తిరుగుతున్న సంగతి తెలిసిందే. ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని కొందరు, ఆదరిస్తున్నారని మరికొందరు, జేజేలు పలుకుతున్నారంటూ ఇంకొందరు తెగేసి ప్రచారం చేసుకుంటున్నారు. అధికార పార్టీ అన్నాక ఆ మాత్రం ఉంటుంది. కానీ, ఆదరణ వెనుక వేదన అర్థం చేసుకోకపోతే పాలకులు పొరపడినట్టే. ఇందుకు కారణాలు, నిదర్శనాలు లేకపోలేదు. ప్రభుత్వం పెంచిన పింఛను సాయం, ఉచిత గ్యాస్‌సిలెండర్లు, తల్లికి వందనం వంటివి కొంతమేరకు జనాన్ని సంతృప్తి పరిచాయని అనుకోవడంలో పొరపాటు లేదు. త్వరలోనే చెల్లిస్తామన్న అన్నదాత సుఖీభవ పథకం, గత ప్రభుత్వం అమలు చేసిన రైతు భరోసా పథకంతో పోలిస్తే ఉమ్మడి విజయనగరం జిల్లాలో వేలాది మందికి వర్తించలేదని సాక్షాత్తు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనే అధికార యంత్రాంగం అంగీకరించింది. ఇదిగో అదుగో అంటున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ప్రభుత్వ స్వరం మారింది. ఎన్నికల ముందు రాష్ట్ర వ్యాప్త ప్రయాణం అన్న సర్కారు, తాజాగా జిల్లాకు పరిమితం చేయనున్నట్టు లీకులిస్తోంది. నిరుద్యోగ భృతి అన్నమాటేలేదు. ఇటువంటి తరుణంలో వీరంతా సుపరిపాలన అన్న మాటను ఎలా ఏకీభవిస్తారో ప్రభుత్వమే చెప్పాలి. వాస్తవానికి ఇటువంటి ఉచిత పథకాలకు, రాయితీలకే సుపరిపాలన అనుకుంటే, నీరు, నీడ, గూడు కోసం జనం ఎందుకు అల్లాలాడిపోతున్నారు. పరిపాలన అంత సుభిక్షంగా ఉంటే ఇటీవల చేపట్టిన సమ్మె అంతలా ఎందుకు విజయవంతమౌతుంది. ఇన్ని తరగతులకు వారు ఎందుకు భాగస్వామ్యయ్యారు? దీనికి సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం, ముఖ్యంగా ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు నేల విడిచిసాము చేస్తున్నట్టు 'సుపరిపాలన పేరిట ఇంటింటికీ తిరిగినప్పుడు ప్రజలు నిలదీయకపోవడమే గొప్పగా చెప్పుకుంటే ఎలా? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

అధికారంలోకి రాగానే వ్యవసాయ రంగాన్ని ఉద్ధరిస్తామని టిడిపి కూటమి నాయకులు చెప్పారు. ఇందుకోసం ముఖ్యంగా తోటపల్లి, రామతీర్థసాగర్ పూర్తిచేస్తామన్న మాట నిలబెట్టుకోలేదు. 2025- 26 ఆర్థిక సంవత్సరంలో రామతీర్థసాగర్‌కు రూ.807.55కోట్లు అవసరం కాగా, కేవలం రూ.68 కోట్లు, తోటపల్లి రూ.519 కోట్లు అవసరం కాగా రూ.47.81 కోట్లు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. బొబ్బిలి, గజపతినగరం బ్రాంచి కెనాల్ పూర్తిచేస్తామని హామీ ఇచ్చినప్పటికీ నెరవేర్చలేదు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఎప్పటి మాదిరిగానే డోలిమోతలు కొనసాగుతున్నాయి. గిరిజన విద్యార్థుల ఆరోగ్య భద్రత కోసం ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంల నియామకానికి మంత్రి తొలిసంతకం అమలుకు నోచుకోలేదు. బిసి రుణాల్లో రాజకీయాల సిఫార్సులకు పెద్దపీట వేశారు. గిరిజన యూనివర్శిటీ భవన నిర్మాణ పనులు నత్తనడకనే సాగుతున్నాయి. జిల్లాను చుట్టు ముడుతూ అన్ని వైపులా టోల్‌గేట్లు ఏర్పాటు చేసి, వాహనదారులపై భారాలు మోపారు. అంగన్‌వాడీలు, ఆయాలు, ఆశా వర్కర్లు వంటి చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు పెరిగాయి. సహకార రంగంలో ఉన్న భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని అధికారికంగా మూసేశారు. సాలూరులోని జీగిరాం జ్యూట్ మిల్లు, సీతానగరం మండలంలోని ఎన్‌సిఎస్ సుగర్స్, కొత్తవలసలో జిందాల్ పరిశ్రమ, గజపతినగరం మండలంలో ఓలం జీడిపిక్కల ఫ్యాక్టరీ మూతపడ్డాయి. ఫలితంగా వేలాది మంది కార్మికులు జీవనోపాధి కోల్పోయినా ప్రభుత్వం చలించలేదు. మునుపెన్నడూ లేని విధంగా ఉపాధిహామీ అమలులో కూడా జిల్లా వెనుకబడిపోయింది. తగినన్ని పనిదినాలు కల్పించడం లేదు. రూ.వందల కోట్ల బకాయి ఉంది. అంతకు మించి కూలిరేట్లు కూడా గిట్టుబాటు కావడం లేదు. సగటు వేతనం రూ.180 కూడా రావడం లేదు. ఈ విషయంలో మన జిల్లా రాష్ట్రంలోనే వెనుకబడి పోయింది. ఈ నేపథ్యంలో ఇదే సుపరిపాలన అంటూ జనం చర్చించుకుంటున్నారు.

సిఐటియు మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - రేగిడి


కార్యకర్తలతో మాటట్లాడుతున్న నాయకులు

మండలంలోని ఉంగరాడ మెట్ట సిఐటియు మండల సమన్వయ కమిటీ ఎన్నికలు ఎం.త్రినాధ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు పి. శంకరరావు, కె. సురేష్ ఎన్నిక నిర్వహించారు. మండల కన్వీనర్‌గా ఎం. త్రినాథ్, కో కన్వీనర్‌గా ఆర్. సుజాతతో పాటు కమిటీ సభ్యులుగా మరో 10 మందిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గ వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నాయన్నారు. లేబర్ కోడ్స్ రద్దు, ధరలు పెరుగుదల ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ, కార్పొరేట్లు కొమ్ముకాస్తున్నాయని అన్నారు. దేశ సంపదను కార్మిక శ్రమను దోచుపెట్టే విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమన్వయ కమిటీలో అంగన్వాడి, ఆశ, మధ్యాహ్నం భోజనం, గ్రీన్ అంబాసిడర్, ఫీల్డ్ అసిస్టెంట్స్ బిల్డింగ్ వర్కర్స్, కె.పెంటయ్య, జి. దుర్గారావు ఉన్నారు.

పంపుహౌస్ ఆపరేటర్ల ధర్నా

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని బొడ్డవలస నాగావళి నది సమగ్ర రక్షిత మంచినీటి పథకం ద్వారా పలు మండలాలకు తాగునీరు సరఫరా చేస్తున్న ఆపరేటర్లు జీతభత్యాలు అందక ఆకలితో అలమటిస్తు న్నామని శనివారం ధర్నా చేశారు. గత ఏడు నెలలుగా జీతభత్యాలు లేక కుటుంబాలతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజు రాత్రి, పగలు తేడా లేకుండా సమగ్ర రక్షిత మంచినీటి పథకాల వద్దకు చేరి ప్రతి మండలానికి తాగునీరు సరఫరా చేస్తున్నామని ఏడు నెలలగా జీతభత్యాలు లేకుండా ఎలా పనిచేసేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీతభత్యాలు ఇవ్వకుంటే పనిచేసేది లేదని హెచ్చరించారు. పంపు ఆపరేటర్లు ధర్నా చేస్తే ఐదు మండలాలకు సంబంధించి తాగునీరుకు ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని, మానవతా దృక్పథంతో జీతభత్యాలు ఇవ్వకపోయినా పనిచేస్తున్నామని తెలిపారు. ఇదే విధంగా సంతకవిటి మండలం జావాంలో సమగ్ర రక్షిత మంచినీట పథకంలో పనిచేస్తున్న పంపు ఆపరేటర్లు కూడా ధర్నా చేశారు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు స్పందించి 7 నెలల జీతభత్యాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పంపు ఆపరేటర్లు కోరుతున్నారు.

పిఎసిఎస్ అధ్యక్షుడిగా బెజ్జిపురం రవి

ప్రజాశక్తి - వంగర



మండలంలోని శివ్వాం పిఎసిఎస్ అధ్యక్షుడిగా నీలయ్య వలస గ్రామానికి చెందిన బెజ్జిపురం రవి నియామకం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ తనకు ఇచ్చిన ఈ బాధ్యతను వమ్ము చేయకుండా బాధ్యతగా పనిచేస్తానని తెలిపారు. తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘ కాలం పాటు పనిచేసిన తనను గుర్తించి ఈ బాధ్యత అప్పజెప్పిన ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, ఆయన సోదరుడు టిడిపి సీనియర్ నాయ కులు కోండ్రు జగదీష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పిఎసిఎస్ అధ్యక్షుడిగా నియామకమైన బెజ్జిపురం రవికి పలువురు అభినందనలు తెలిపారు.

తాగుడు వల్ల అనర్ధాలపై అవగాహన

ప్రజాశక్తి - కొత్తవలస

కంపెనీలో పని చేసేవారు తాగుడకు బానిస కాకుండా, జాగ్రత్తగా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎక్సైజ్ సిఐ జి.ఎస్. రాజశేఖర్‌నాయుడు హితవు పలికారు. శనివారం కంటకాపల్లి వద్ద గల అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ వద్ద తాగుడు వల్ల కలిగే అనర్ధాలపై అవగాహన కల్పించారు. పరిశ్రమలో పనిచేసే వారు ఎవరైనా ఆల్కహాలకు బానిసలై ఇబ్బంది పడుతుంటే వారిని రిహబిల్టేషన్ సెంటర్‌కు తరలించి ట్రీట్మెంట్ అందించడానికి సహకరిస్తామని, అలాంటివారిని ఎవరినైనా గుర్తిస్తే తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సి వీర్రాజు, రమేష్, ఫ్యాక్టరీలో పని చేస్తున్న సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాయన్న కాలువకు తలుపులు ఏర్పాటు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని ఆడవరం గ్రామ సమీపంలో సాయన్న కాలువ తలుపులు పూర్తిగా శిథిలం కావడంతో సాగునీరు వృథాగా పోతుంది. దీంతో సాగునీరు అందక పంటలు పండించలేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ఈ విషయాన్ని గ్రామ రైతులు కర్నేన మహేశ్వరరావు, మొయ్య రామారావు, కె.శరత్ బాబు, పి.జనార్ధన రావు, కె.ఫకీర్‌నాయుడు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన చొరవతో ఈ ఐదుగురు రైతులు ఆర్థిక సహాయంతో సాయన్న కాలువ తలుపులు వేసేందుకు చర్యలు తీసుకున్నారు. కొంతమంది రైతులు సహకారంతో శనివారం వారంతా సంఘటితంగా తలుపులు ఏర్పాటు చేసుకున్నారు.

పేదలకు వరం సిఎం సహాయ నిధి

ప్రజాశక్తి- లక్కవరపుకోట

పేదలకు వరం సిఎం సహాయ నిధి అని, వైద్య ఖర్చులు భారమైన ప్రతి పేదవారికి ఇది ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు రూ. 11.09లక్షలను సుమారు 15 మందికి అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కెబిఎ రాంప్రసాద్, ఎస్‌కోట మండల పార్టీ అధ్యక్షులు జిఎస్ నాయుడు, ఎఎంసీ ఛైర్మన్ చొక్కాకుల మల్లు నాయుడు, మాజీ జెడ్‌పిటిసిలు కరెడ్ల ఈశ్వరరావు, కోళ్ల శ్రీను, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

మరో ముగ్గురికి గాయాలు

శృంగవరపుకోట: మండలంలోని కిల్తనపాలెం పంచాయతీ నవోదయ విద్యాలయం సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా మరో ముగ్గురు యువకులు గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం..మండలంలోని లచ్చందొర గ్రామానికి చెందిన కండేపల్లి సుధీర్(18) తన స్నేహితులతో కలిసి బొడ్డవర పంచాయతీ అంబాదాసు పాలెం గ్రామానికి చెందిన ఆటోలో ముషిడిపల్లి బయలు దేరారు. వీరు ప్రయాణిస్తున్న ఆటో నవోదయ విద్యాలయం దాటుతుండగా ఎదురుగా వస్తున్న టాటా ఎసీ వాహనం బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో సుధీర్ ఘటనా స్థలంలోనే మృతి చెందగా ఆటో నడుపుతున్న నిఖిల్ ఆటోలో ఉన్న గణేష్, జగదీష్‌లు గాయపడ్డారు. వీరిని వెంటనే ఎస్‌కోట ప్రభుత్వాస్పత్రికి తరలించగా గణేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కెజిహెచ్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

కంటోన్మెంట్: ధర్మపురి గ్రామంలో బైకు అదుపుతప్పి ఇంటిగోడను ఢీకొని తీవ్రంగా గాయపడిన యువకుడు శనివారం మృతి చెందాడు. రూరల్ పోలీసులు కథనం ప్రకారం.. పట్టణంలోని గొంపవీధికి చెందిన పిన్నింటి ప్రణీత్ (15) ఈ నెల 9న సింహాచలం వెళ్లారు. 10వ తేదీన మధ్యాహ్నం భీమిలి నుండి బయలుదేరి ఇంటికి వస్తుండగా ధర్మపురి వద్ద బైకు అదుపుతప్పి ఇంటి గోడను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురిలో వెనుక కూర్చున్న ప్రణీత జిల్లా సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ వి.అశోక్ కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కంటోన్మెంట్: గజపతినగరం మండలంలోని భూదేవి పేట గ్రామానికి చెందిన గంధవరపు అప్పాలు (71) శనివారం రైలు ఢీకొని మృతి చెందినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ బి. ఈశ్వరరావు తెలిపారు. మరుపల్లి హాస్పిటల్‌కు వెళ్లే క్రమంలో గ్రామానికి సమీపంలో ఉన్న రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారన్నారు. మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

పిడిఎస్ బియ్యం పట్టివేత

పూసపాటిరేగ: మండలంలోని తిప్పలవలస గ్రామంలో శుక్రవారం రాత్రి రాయితి లక్ష్మి, భర్త ఎర్రయ్య ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 40.21 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని భోగాపురం సిఎస్‌డిటి మురళీకృష్ణతో పాటు రాజాం, గజపతినగరం, గంట్యాడ సిఎస్‌డిటిల బృందం కలిసి పట్టుకుని సీజ్ చేశారు. సీజ్ చేసిన బియ్యాన్ని భోగాపురంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌కు అప్పజెప్పారు. ఈ ఘటనపై నిందితులపై 6(ఎ) కేసు నమోదు చేసినట్లు సిఎస్‌డిటి టి.మురళీకృష్ణ తెలిపారు. అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం గుర్తించి తగిన చర్యలు తీసుకున్నామని ఆయన వెల్లడించారు.

రైతుకు దొరకని 'సంపద'

◆ అన్నదాతకు అందని సంపద వరి విత్తనాలు ◆ చేతి చమురు వదిలించుకుని ప్రైవేటులో కొనుగోలుకు మొగ్గు ◆ ప్రభుత్వం ఆ రకం విత్తనాలు అమ్మకాలు చేపట్టాలని డిమాండ్

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని 39 గ్రామ పంచాయతీలో 66 గ్రామాల్లో రైతులు ఖరీఫ్ వ్యవసాయంలో నిమగ్నమయ్యారు. అయితే ఈ ప్రాంతంలో ఎక్కువగా దిగుబడి వచ్చే 'సంపద' విత్తనాలు లేక రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. ప్రభుత్వం ఈ విత్తనాలను అందుబాటులోకి తీసుకురాకపోవడంతో ప్రైవేట్ దుకాణాల్లో అధిక ధరలకు సంపద విత్తనాలు కొనుగోలు చేసి ఈ ఏడాది వ్యవసాయం చేసుకుంటున్నారు. మరి కొంత మంది ప్రభుత్వం సంపద విత్తనాలు ఇస్తుందేమోనని ఎదురు చూస్తున్నారు. వరి వంగడాలలో గత రెండేళ్లుగా సంపద వరి విత్తనాలు కొంతమంది ఖరీఫ్ వ్యవసాయం చేస్తున్నారు. 133 రోజుల్లో పంట చేతికి రావడంతో పాటు ఎకరానికి 40 బస్తాలు దిగుబడి వస్తుంది. దీంతో రైతులు ఈ సంపద వరి విత్తనాన్ని ఆశ్రయిస్తున్నారు. ఈ ఖరీఫ్ వ్యవసాయానికి ప్రభుత్వం రాయితీపై రైతు సేవా కేంద్రాల్లో 1121 రకం, స్వర్ణ, సాంబ మసూరి, 1318 రకం విత్తనాలను అందుబాటులో ఉంచిందే తప్ప సంపద విత్తనాలను తీసుకురాలేదు. దీంతో రైతులు ఈ నాలుగు రకాలు వరి విత్తనాలు ఖరీఫ్ వ్యవసాయానికి తీసుకు వెళ్లకపోవడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో వ్యవసాయ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. సంపద వరి విత్తనాలు రాయితీ లేకపోయినా ప్రైవేట్ దుకాణాలకు వెళ్లి అదనంగా నగదు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు.

మండలంలో వాస్తవంగా 25,432 ఎకరాలు వరి సాగు చేయవలసి ఉండగా, 7వేల ఎకరాలలో కేవలం సంపద విత్తనాలను ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేసి ఈ ఏడాది పంటలు వేస్తున్నారు. స్వర్ణ, సాంబ మాసూరు,


నారు మడిని సిద్ధం చేసుకుంటున్న రైతు

1121రకం, 1318 రకాల వరి విత్తనాలు ఆయా గ్రామాల్లో అక్కడక్కడ రైతులు 100 ఎకరాలు కూడా వేయని పరిస్థితి ఉంది. ప్రభుత్వాలు పాత వరి వంగడాల రకాలు మాత్రమే తేవడంతో వాటి దిగుబడి రాక రైతులు ప్రాధాన్యత ఇవ్వడం లేదు. ప్రస్తుతం ఎకరానికి 40 బస్తాలు దిగుబడి వస్తున్న సంపద వరి విత్తనాలు ప్రభుత్వం రైతులకు రాయితీతో ఇస్తే మరింత వరి పంటలకు మొగ్గు చూపుతామని ఆయా గ్రామాల రైతులు చెబుతున్నారు. రబీ వ్యవసాయనికైనా ప్రభుత్వం సంపద విత్తనాలను తెప్పించేలా కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

సంపద విత్తనాలతో అధిక దిగుబడులు

ఈ ఏడాది ఖరీఫ్ వ్యవసాయం సంపద విత్తనాలతో పంటలు పండిస్తున్నాం. దిగుబడి బాగా వస్తుంది. గతంలో 1121, స్వర్ణ, సాంబమసూరు వంటి వరి రకాలు మాత్రమే వేసాం. ప్రస్తుతం నూతన వరి వంగడం అయిన సంపద విత్తనాలు వేసి పంటలు పండిస్తున్నాం.

నారు జనార్ధన రావు, రైతు, సంకిలి.

సంపద వరి విత్తనాలు సరఫరా చేయాలి

ప్రభుత్వం సంపద వరి విత్తనాలు సరఫరా చేయాలి. వ్యవసాయంలో నూతన విధానాల ద్వారా దిగుబడి వచ్చే కొత్త విత్తనాలపై దృష్టి సారించాలి. పంట మార్పిడితో వరి పంటలు దిగుబడులు సాధ్యమవుతున్నాయి. కొత్త వరి వంగడాలతో పాటు సేంద్రియ ఎరువులు వాడకం కారణంగా దిగుబడులు వస్తాయి. సంపద విత్తనాలు ప్రభుత్వమే సరఫరా చేయాలి.

బాన్న హరినాథ్, రైతు, సంకిలి.

రైతులు వరి విత్తనాలు తీసుకెళ్లడం లేదు

స్వర్ణ, సాంబ మాసూరు, 1121 రకాల వరి విత్తనాలు రైతు సేవ కేంద్రాల్లో అమ్మకాలకు ఉంచాం. రైతులు ఈ వరి విత్తనాలు తీసుకు వళ్లడం లేదు. ఈ విత్తనాలు స్టాకు ఉన్నాయి. రైతులు ఈ విత్తనాలు తీసుకువెళ్లకపోవడంతో ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితి ఉంది. ఈఏడాది ఖరీఫ్ వ్యవసాయానికి సంపద వరి విత్తనాలపై దృష్టి సారించారు. ఈ విత్తనాలు వేయడంతో 133 రోజుల్లో పంట వచ్చి, ఎకరానికి 40 బస్తాలు దిగుబడి రావడంతో రైతులు మొగ్గు చూపుతున్నారు.

గిరడ మురళి కృష్ణ, ఎఒ, రేగిడి.

ఉన్నత విద్య, నైపుణ్యాలతోనే దేశాభివృద్ధి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి

క్లౌడ్ సెంటర్‌గా సెంచూరియన్: ఉపాధ్యక్షులు

ఉన్నత విద్య, నైపుణ్యాలు దేశాభివృద్ధికి తోడ్పడతాయని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు అన్నారు. విద్యతో పాటు ఉద్యోగ, ఉపాధి మార్గాలనూ నేర్పుతున్న సెంచూరియన్ విశ్వ విద్యాలయం భవిష్యత్‌లో ఎంతో మందికి ఉన్నతమైన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని ఆయన ఆకాంక్షించారు. విశ్వ విద్యాలయ ఛాన్సలర్ డాక్టర్ జిఎస్ఎన్ రాజు ఆహ్వానం మేరకు శనివారం విశ్వ విద్యాలయాన్ని డాక్టర్ డివిజి శంకరరావు సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలను పరిశీలించడంతో పాటు అక్కడి విశేషాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ రంగంతో పాటు మెకానికల్, వైద్య తదితర విభాగాలలో విశ్వ విద్యాలయం అందిస్తున్న విద్యావకాశాలను ఛాన్సలర్ డాక్టర్ జిఎస్ఎన్ రాజు వివరించారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమంలో భాగంగా మహిళలు కుట్టుపని నేర్చుకుని ఆదాయ మార్గాలను పెంచుకోవడాన్ని డాక్టర్ డివిజి శంకరరావు ఈ సందర్భంగా అభినందించారు. విశ్వ విద్యాలయ గ్రంథాలయాన్ని పరిశీలించారు.

క్లౌడ్ సెంటర్‌గా సెంచూరియన్ తీర్చిదిద్దాం

సెంచూరియన్ విశ్వ విద్యాలయాన్ని క్లౌడ్ సెంటర్‌గా తీర్చిదిద్దామని ఆ సంస్థ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డిఎన్ రావు అన్నారు. శనివారం విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి అన్ని విభాగాల్లో కృత్రిమ మేథ (ఎఐ) చేరుస్తామని చెప్పారు. ప్రస్తుతం సెంచూరియన్ ఒక క్లౌడ్ సెంటర్‌గా రూపొందిందన్నారు. దేశంలో అగ్రగామిగా ఉన్న 50 సంస్థలతో తాము ఎంఒయూ కుదుర్చుకున్నామన్నారు. ఇక్కడ విద్యార్థులకు డొమైన్ బేస్ ప్లేస్మెంట్స్ అందించడం తమ ప్రత్యేకత అన్నారు. ఇతర విశ్వవిద్యాలయాలకు భిన్నంగా సెంచూరియన్ విశ్వవిద్యాలయం తయారు చేస్తున్నామన్నారు. ఇక్కడ రెండు సూపర్ పవర్ కంప్యూటర్లు ఉన్నాయన్నారు. ఒల్డ్ యాప్స్ తయారు చేస్తాన్నామని వివరించారు. దేశంలోనే 28 నానో చిప్స్ తయారు చేస్తొన్న మొదటి విశ్వవిద్యాలయమని చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి నైపుణ్యంతో కూడిన యువత అవసరమన్నారు. దానిని దృష్టిలో పెట్టుకొని యువతకు అవసరమైన నైపుణ్యాలను నేర్పిస్తున్నామన్నారు. స్మార్ట్ అగ్రికల్చర్ అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. ఈ సందర్భంగా ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ సెంచూరియన్‌ను ఒక స్కిల్ యూనివర్సిటీగా అభివృద్ధి చేశామన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల శిక్షణలు అందిస్తున్నట్లు చెప్పారు. ఏటా కొత్త కోర్సులు ప్రారంభించడంతో పాటు 32 డొమైన్స్ అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ తదితరులు పాల్గొన్నారు.


డ్రోన్లను పరిశీలిస్తున్న ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి

పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ యూనిట్ ఏర్పాటు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల, గుర్ల పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నెల్లిమర్ల యూనిట్ ఎన్నిక శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా ఎటివి ప్రసాద్ (గుర్ల), వైస్ ప్రెసిడెంట్‌గా జి.రాంగోపాల్ (గుర్ల), కార్యదర్శిగా పి.సర్వేశ్వర రావు (నెల్లిమర్ల), జాయింట్ సెక్రటరీగా బి. కీర్తన (నెల్లిమర్ల), ట్రెజరర్‌గా పి.శంకరరావు (నెల్లిమర్ల), జిల్లా కౌన్సిల్ సభ్యులుగా డిఎవి ప్రభాకర్ (నెల్లిమర్ల), పి.శ్రీనివాసరావు (నెల్లిమర్ల), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బి.రోహిణి (నెల్లిమర్ల) ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలో నెల్లిమర్ల, గుర్ల మండల పంచాయతీ రాజ్ మినిస్టిరియల్ ఎంప్లాయిస్ పరిపాలన అధికార్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టు, రికార్డు అసిస్టెంట్లు, సబ్-డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అండగా పంటల బీమా

ప్రజాశక్తి - సంతకవిటి


ఎఒ యశ్వంత్‌రావు

ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం వాటిల్లినప్పుడు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు రైతులు తమ పంటలకు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని అప్పుడు రైతులకు పంటల బీమా అండగా ఉంటుందని ఎఒ సి.బి.యశ్వంత్ రావు తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ పంటల బీమా రైతులకు ఆర్థిక సహాయం అందించి, కష్ట సమయాల్లో అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. పంట రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంకులు ప్రీమియం మొత్తాన్ని తగ్గించుకుంటాయన్నారు. ఇతర రైతులు తమ సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీలు) ద్వారా, ఆన్‌లైన్‌లో ఎన్‌సిఐపి పోర్టల్ ద్వారా సులభంగా నమోదు చేసుకోవచ్చునన్నారు. బీమా నమోదు కోసం రైతులు ఆధార్ కార్డు, భూమి పత్రాలు (పట్టాదారు పాస్‌బుక్ వంటివి), కౌలు రైతుల కోసం సిసిఆర్‌ఆర్ కార్డుతో నమోద చేసుకోవచ్చునన్నారు. వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు ఎకరానికి రూ.168, రూ.1923, రూ.165లను ఈనెల 15వ తారీకులోపు, పత్తి రైతులు 31వ తారీకులోపు పంటల బీమా చెల్లించాలన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, గడువులోగా తమ పంటలకు బీమా చేయించుకోవడం ద్వారా భవిష్యత్ నష్టాల నుండి రక్షణ పొందాలని వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు విజ్ఞప్తి చేశారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - వంగర

మండల కేంద్రంలోని వివేక్ మాస్టర్ మైండ్ పాఠశాల వద్ద ఈనెల 13 ఆదివారం ఉదయం 8 గంటల నుండి, మధ్యాహ్నం 2గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు సాదేం వెంకటరమణ తెలిపారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ వైద్యులు కంటి తనిఖీలు చేస్తామన్నారు. కంటి రోగులు వచ్చి తనిఖీలు చేసుకోవాలని, కంటి ఆపరేషన్ అవసరమైన రోగులకు విశాఖపట్నం తీసుకువెళ్లి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తారని తెలిపారు.

సూపర్ సిక్స్ అమలు చేస్తున్నాం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొత్తవలస

సిఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ హామీలన్నింటినీ అమలు చేస్తామని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని గనిశెట్టి పాలెంలో శనివారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆమె ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు గురించి వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుగుసుకొని సంబంధిత అధికారులకు పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు. పింఛన్లు సమయానికి ఇస్తున్నామని, తల్లికి వందనం ఎంతమంది ఉంటే అంత మందికి ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొరపల్లి రాము, ప్రధాన కార్యదర్శి కనకాల శివ, ఉపాధ్యక్షులు యల్లపు సూరిబాబు, మాజీ జెడ్‌పిటిసి కోళ్ల శ్రీను, లెంక శ్రీను, మాజీ సర్పంచ్ విరోతు శివాజీ, బంగారు రమేష్, నక్కరాజు చిన రాము, యూనిట్ ఇంచార్జ్ గొంప దుర్గా ఉమేష్, జామి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.


డెంకాడ: ప్రభుత్వ పథకాలుపై వివరిస్తున్న కర్రోతు

డెంకాడ: భోగాపురం మండలంలోని గుడివాడలో శనివారం రాత్రి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రాష్ట్ర మార్కెఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిల్ల జమున, టిడిపి నాయకులు చిల్ల సురేష్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ దాసరి అప్పలస్వామి, యూనిట్ ఇంఛార్జి కొండపు ఈశ్వరరావు, గ్రామ టిడిపి అధ్యక్షులు చిల్ల పరుశురాం, వైస్ సర్పంచ్ దాసరి బుజ్జి, గ్రామంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కొత్తవలస: పథకాలు గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

విజయనగరం కోట: ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. శనివారం 40, 41, 47 వార్డుల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మండలంలో గుంకలాం గ్రామంలో పర్యటించి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు వీరేష్ చంద్రదేవ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జిపై ఆరోపణలు అవాస్తవం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జనసేన పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి వబ్బిన సత్యనారాయణ పై చేసిన ఆరోపణలు అవాస్తవమని జనసేన మండల నాయకులు అన్నారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించింది. నియోజకవర్గ ఇన్చార్జి వబ్బిన సత్యనారా యణను ఇంఛార్జి పదవి నుంచి తప్పించాలని కొంతమంది జనసైనికులు శుక్రవారం చేపట్టిన నిరసనను మరి కొంత మంది జనసేన పార్టీ నాయకులు ఖండించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ సత్యనారాయణపై చేసిన ఆరోపణలు అవాస్తవం అని, పార్టీ ఆదేశాలకు అనుగు ణంగా సత్యనారాయణ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నా రన్నారు. కూటమిలో భాగంగా మిత్ర ధర్మం పాటిస్తూనే పార్టీ కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటున్నారని, పార్టీ నిర్ణయాలకు అందరూ కట్టుబడి పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు తాండ్రంగి చంటి, మోపాడ కృష్ణ, దొగ్గ రమణ, పిల్లా రామదుర్గ, మల్లువలస శ్రీను, తూర్పాటి రాము, యలమంచిలి దేముడు, రవి, నాని, పులిబంటి సంతోష్, యల్.వి.ప్రసాద్, పాల్గొన్నారు.

పశుగ్రాసంపై అవగాహన

వేపాడ: పశుగ్రాస వారోత్సవాలలో భాగంగా శనివారం చినగుడిపాల గ్రామంలో పాడి రైతులకు పశుగ్రాసం పెంపకం వల్ల కలిగే లాభాలు, పశుగ్రాస ప్రాముఖ్యత, పశుగ్రాస పెంపకం కోసం గవర్నమెంట్ అందిస్తున్న పథకాలు మీద వేపాడ పశువైద్యాధికారి డాక్టర్ కోరాడ గాయత్రి అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా గ్రామంలో ఉచిత పశుగర్భకోస ఆరోగ్య శిబిరం నిర్వహించి 22 మంది పాడి రైతులకు చెందిన 27 పశువులకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ బోజంకి రామానాయుడు సందర్శించారు. శిబిరంలో వేపాడ పశువైద్య సిబ్బంది, పశు సంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

నిధులు నిల్.. అధికారుల సందర్శన ఫుల్

ప్రజాశక్తి- బాడంగి


మాట్లాడుతున్న గౌరు

మండలంలోని లక్ష్మీపురం పంచాయతీలో ఈ ఏడాది పది రాష్ట్ర, కేంద్ర టీమ్‌లు సందర్శించాయి కానీ తమకు నిధులు కేటాయిం చలేదని ఎంపిటిసి పాలవలస గౌరు అన్నారు. ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడుతూ తమ గ్రామంలోని బృందాలు పర్యటించడం వల్ల ప్రజలకు, గ్రామానికి ఎలాంటి ఉపయోగం ఉండటం లేదని అయన అన్నారు. మండలంలో 25 పంచాయతీలు ఉండగా ఎస్‌టి పంచా యతీగా ఉన్న లక్ష్మీపురం గ్రామాన్నే ఎందుకు ఎంచుకుంటున్నారో అర్థం కావడం లేదన్నారు. టీములు వచ్చిన ప్రతిసారి పంచాయతి నిధులు లేకపోయినప్పటికి గ్రామ సర్పంచ్ పాలవలస పార్వతి, ఎంపిటిసి అయిన తను సొంత నిధులను ఖర్చు చేస్తున్నామన్నారు. ఉన్నతాధికారులు జిల్లాకు ఏ టీమ్ వచ్చినా మొదటగా తమ పంచాయతీనే ఎందుకు ఎన్నుకుంటున్నారో వివరణ ఇవ్వాలని లేని పక్షంలో ఈ విషయాన్ని ఎమ్మెల్యే బేబినాయన, పంచాయతీరాజ్ మంత్రి పవన్ కల్యాణ్, సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని ఆయన తెలిపారు.

చంద్రబాబు మోసాలకు తగిన బుద్ధి చెప్పాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

చంద్రబాబు మోసాలకు తగిన బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే, వైసిపి నియోజకవర్గం సమన్వయకర్త బడ్డుకొండ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. శనివారం చంద్రబాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా దన్నానపేట, ఎటి అగ్రహారం, రామతీర్థం, సీతారామునిపేట, గొర్లిపేట, కొత్తపేట, సారిపల్లి, కొండగుంపాం, గరికిపేట, పూతికపేట గ్రామాల్లో పర్యటించి చంద్రబాబు మోసాలను వివరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ ఎన్నికల్లో మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ముఖ్యంగా అర్హులైన వారికి పింఛన్లు ఇస్తామని చెప్పి చనిపోయిన వారి స్థానంలో పింఛన్లు ఇచ్చారని మిగతా అర్హులైన వారికి కొత్త పింఛన్లు ఇవ్వకపోవడం మోసమన్నారు. సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి ఒకటి మాత్రమే ఇచ్చారని, ఉచిత బస్ కాస్తా జిల్లాకే పరిమితం చేసి మహిళలను నమ్మించి మోసం చేసిన ఘనత చంద్రబాబుకి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చిక్కాల సాంబశివరావు, సముద్రపు రామారావు, గదల సన్యాసి నాయుడు, మత్స సత్యనారాయణ, డి.గిరిబాబు, సారికి వైకుంఠం, పతివాడ సత్యనారాయణ, రేగాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాన్ని ప్రజలకు వివరించాలి



వేపాడ: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

వేపాడ: చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన ఆధ్వర్యంలో వైసిపి మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలు అమలు చేసే వరకూ పోరాటం చేయడం ప్రతిపక్షంగా మన బాధ్యత అన్నారు. ఈ సమావేశంలో మాజీ డిసిసిబి చైర్మన్ చినరామనాయుడు, మాజీ ఎఎంసీ చైర్మన్ కస్తూరి, ఎంపిపి సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పారావు, వైసిపి మండల అధ్యక్షులు జగ్గుబాబు, వైస్ ఎంపిపి ఈశ్వరరావు, నాయకులు దుల్ల మహేష్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు వెంకట్రావు, యువత అధ్యక్షులు ఉగ్గిన శ్రీను, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.


రోగులను తనిఖీ చేస్తున్న వైద్యులు

ఉచిత మెగా వైద్య శిబిరం

నెల్లిమర్ల: సతివాడలో మిమ్స్ జనరల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచితమెగా వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ రేవల్ల శ్రీనివాసరావు సమక్షంలో మిమ్స్ వైద్య బృందం రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసింది. కళ్ళు, ఎముకల (ఆర్థో) రోగులకు పరీక్షలు నిర్వహించి మిమ్స్ ఆసుపత్రి లో శస్త్ర చికిత్స (ఆపరేషన్) అవసరమైన వారికి ఉచితంగా చేస్తారని శిబిరం నిర్వాహకులు తెలిపారు. కాగా శిబిరంలో 200 మందికి తనిఖీలు జరిపి 5 కంటి ఆపరేషన్, 4 ఎముకలు ఆపరేషన్, 3 సాధారణ రోగులను ఎంపిక చేసి మిమ్స్ ఆసుపత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు జరుపుతామని తెలిపారు. ఈ శిబిరం లో మిమ్స్ జనరల్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్ ఎం.కావ్యశ్రీ, డాక్టర్ ఎం. కేదార్, డాక్టర్ వినీల, డాక్టర్ సుధాకర్, డాక్టర్ చేతన సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి రెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

డెంకాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న మాథ్స్ లెక్చరర్ పోస్టుకు గెస్ట్ లెక్చరర్‌గా పని చేయడానికి ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ హిమగాయత్రి ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్ 50శాతం మార్కులు ఉండాలని, దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 15 చివరి తేది కాగా 17న ఉదయం 11 గంటలకు విజయనగరం టౌన్ కాలేజ్‌లో ఇంటర్వ్యూలు జరుగుతాయని ఆమె తెలిపారు.

సంతకవిటి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లీష్ అధ్యాపక పోస్టులో గెస్ట్ అధ్యాపకునిగా పని చేయడానికి ఆసక్తి, అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ జి.భవాని తెలిపారు. ఇంగ్లీష్ సబ్జెక్ట్‌లో 50 శాతం మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పాసైన అభ్యర్థులు కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో దరఖాస్తుతో పాటు, విద్యార్హతల ధ్రువపత్రాలు జూలై 15వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలన్నారు.